క్లుప్తంగా

రెయిలింగ్ ధ్వంసమైనా పట్టదా?

వైఎస్సార్ విగ్రహం వద్ద ఇదీ దుస్థితి



వైఎస్సార్ విగ్రహం చుట్టూ ధ్వంసమైన రెయిలింగ్

కాకినాడ: నగరంలోని కోకిల సెంటర్‌లోని మహానేత వైఎస్సార్ విగ్రహం చుట్టూ ఉన్న రెయిలింగ్ ధ్వంసమైంది. చాలా రోజులుగా ఈ రెయిలింగ్ శిథిలం కావడంపై వైఎస్సార్ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం అవిరళ కృషి చేసిన మహానేత విగ్రహం దుస్థితి ప్రజలు, అభిమానులను కలచివేస్తోంది. కాంస్య విగ్రహం చుట్టూ రెయిలింగ్ లేకపోవడంతో శునకాలు, పశువులు లోనికి ప్రవేశిస్తున్నాయి. నిత్యం వేలాది మంది సంచరించే ప్రాంతంలోని వైఎస్సార్ విగ్రహ ప్రాంగణం ప్రస్తుత దుస్థితి దయనీయంగా మారింది. రాష్ట్రానికి విశేష సేవలందించిన దివంగత మహానేత విగ్రహం విషయంలో నగరపాలక సంస్థ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందంటూ జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే విగ్రహం చుట్టూ పాడైన రెయిలింగ్‌ను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ భావన చొరవ తీసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాలని వైఎస్సార్ అభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మెగా కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాకినాడ రూరల్: కాకినాడ లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ ఆధ్వర్యంలో స్థానిక ఇంద్రపాలెం పాత మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. అధిక సంఖ్యలో తరలివచ్చిన పురుషులు, మహిళలు, పిల్లలు, వృద్ధులకు వయో బేధం లేకుండా, కాకినాడ లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ ప్రెసిడెంట్ జె.జి.ప్రకాష్ నేతృత్వంలో ప్రత్యేక వసతులు ఏర్పాటు చేసి, కంటి పరీక్షలు నిర్వహించారు. రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల నుంచి వచ్చిన వైద్య బృందం ఆధ్వర్యంలో సిబ్బంది కంటి పరీక్షలు చేశారు. తొలుత బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరానికి 150 మంది హాజరు కాగా, వారిని పరీక్ష చేసిన అనంతరం 15 మందికి ఆపరేషన్లు అవసరమని వైద్యులు వెల్లడించారు. అదేవిధంగా వైద్య శిబిరానికి వచ్చిన వారందరికీ భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా లయన్స్ జిల్లా గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్, మొదటి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు, రెండవ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ బాదం బాలకృష్ణ, పలువురు స్థానిక నాయకులు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి



గాత్ర కచేరి చేస్తున్న విద్యా కల్యాణ్‌రామన్

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ సంక్రాంతి గానసభల్లో భాగంగా ఆదివారం రాత్రి చెన్నైకు చెందిన విద్యా కల్యాణ్‌రామన్ గాత్ర కచేరి నగర ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. షణ్ముఖ ప్రియ రాగంలో మరివేరే, మోహన రాగంలో నను పాలింప, శంకరాభరణంలోని సరోజదళ నేత్రి వంటి కీర్తనలు అందరినీ అలరించాచి. ఆమె గాత్ర కచేరికి వయోలిన్‌పై మాధవన్, మృదంగంపై ఎం శ్రీధర్ సహకారాన్ని అందించారు.

రైతు బజార్.. సమస్యల బేజార్

- చిక్కుల పద్మవ్యూహంగా గాంధీనగర్ రైతు బజార్
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- పశువులతో వ్యాపారులు, వినియోగదారుల అవస్థలు



రైతు బజార్‌లో ఇష్టానుసారంగా పార్కింగ్ చేసిన ఆటోలు, ద్విచక్ర వాహనాలు



గాంధీనగర్ రైతు బజార్ ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న చేపల షెడ్లు

బోట్‌క్లబ్: నగరంలోని కీలకమైన గాంధీనగర్ రైతు బజార్‌లో ప్రస్తుతం 45 మందికి పైగా రైతులు తాము పండించిన కూరగాయలు విక్రయిస్తున్నారు. నిత్యం వెయ్యి మందికి పైగా వినియోగదారులు ఇక్కడ కూరగాయలు కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. అటువంటి రైతు బజార్‌లో సమస్యలు పట్టిపీడిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. ఇరుకు ప్రదేశంలో రైతులు కూరగాయలు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. రైతు బజార్‌కు వస్తే వాహనాలు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియని పరిస్థితుల్లో వినియోగదారులు కొట్టుమిట్టాడుతున్నారు.

అడ్డదిడ్డంగా పార్కింగ్

రైతు బజార్‌లో అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో, తరచూ వాటిని తీసుకునేందుకు వినియోగదారులు పడరాని పాట్లు పడుతున్నారు. రైతు బజార్‌లోని ఆటోలు, రిక్షాలు కూడా వస్తుండడంతో.. వినియోగదారులు ద్విచక్ర వాహనాలు కూడా ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలియక సతమతమవుతున్నారు. మొదట వచ్చినవారు వాహనం పార్కింగ్ చేసి రైతుబజార్‌లోకి వెళితే, తిరిగొచ్చేసరికి అడ్డంగా అనేక వాహనాలు పెట్టేస్తున్నారు. దీంతో వాహనాలు బయటకు తీసేందుకు వీల్లేకుండా పోతుంది. దీంతో ఆయా వాహనాల వారు వచ్చేంతవరకూ వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. గతంలో రైతు బజార్ వద్ద ట్రాఫిక్ సిబ్బంది ఉండడంతో ప్రజలు వాహనాలను రైతు బజార్ బయట పార్కింగ్ చేసేవారు. దీంతో వినియోగదారులకు ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం అక్కడ ట్రాఫిక్ సిబ్బంది లేకపోవడంతో, ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు.

పశువులతో ఇబ్బందులు

గాంధీనగర్ రైతుబజార్‌లో వేళాపాళా లేకుండా పశువులు రావడంతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాడైన కూరగాయలను రైతు బజార్ ఆవరణలో రైతులు పడేస్తున్నారు. వీటిని కార్పొరేషన్ సిబ్బంది తొలగించకపోవడంతో, ఆవులు, పశువులు వీటిని తినేందుకు రైతు బజార్‌లోకి వస్తున్నాయి. వినియోగదారులు ద్విచక్ర వాహనానికి కూరగాయలు సంచి పెడితే, వాటిని కూడా పశువులు తినివేస్తున్నాయి. ఒకవైపు రైతులు కూరగాయలు విక్రయిస్తుంటే, పశువులు రైతు బజార్‌లోనికి వచ్చి కూరగాయలు తినేస్తుండడంతో తాము నష్టపోతున్నామని వ్యాపారులు వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి రైతు బజార్‌లోకి పశువులు రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు, వినియోగదారులు కోరుతున్నారు.

ఖాళీ స్థలం రైతులకివ్వాలి

రైతు బజార్ ప్రాంగణంలో ఉన్న చేపలు విక్రయించే స్థలం గత తొమ్మిదేళ్లుగా ఖాళీగానే ఉంది. ఇక్కడ చేపలు విక్రయించుకునేందుకు సరైన సదుపాయాలు లేవు. దీంతో మత్స్యకారులు ఇక్కడ చేపల విక్రయాలు మానివేశారు. దీంతో ఈ స్థలం నిరుపయోగంగా ఉంది. కార్పొరేషన్ అధికారులు ఇక్కడ చేపలు విక్రయించేందుకు సదుపాయాలైనా కల్పించాలని, లేకుంటే రైతులకైనా ఇస్తే మరింత మంది కూరగాయలు విక్రయించుకునేందుకు వీలుంటుందని చెబుతున్నారు.

ఆదివారం తప్పని ఇక్కట్లు

సెలవు కావడంతో ఆదివారం ఉద్యోగస్తులు వారానికి సరిపడా కూరగాయలు కొనుగోలు చేసేందుకు రైతు బజార్‌కు వస్తున్నారు. దీంతో ఆదివారం మరిన్ని వాహనాలు ఇక్కడకు వస్తున్నాయి. దీంతో గాంధీనగర్ రైతు బజార్‌లో అడుగు పెట్టేందుకు కూడా ఖాళీ ఉండడం లేదు. ఉదయం పూట ఆటోలు సైతం లోపలికి రావడంతో, ద్విచక్ర వాహనాలు లోపలికి ప్రవేశించడానికి వీల్లేకుండా పోతుంది. మరోవైపు రైతులు వారి పంట ఉత్పత్తులను ఆటోల ద్వారా మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు. దీంతో ఆదివారం గాంధీనగర్ రైతు బజార్‌లో కూరగాయల కొనుగోలుకు రావడం సాహసమే అవుతోంది.

వాహనాల పార్కింగ్ అసౌకర్యంగా ఉంది



ఆదివారం రైతు బజార్‌కు కూరగాయల కొనుగోలుకు వస్తే, నా ద్విచక్ర వాహనం రైతు బజార్ బయట దూరంగా పార్కు చేస్తున్నాను. లోపలకు వచ్చేందుకు కూడా వీలులేకుండా పోతుంది. లోపల వాహనాలు కూడా ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రైతు బజార్‌కు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది.

– ఎస్.సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ ఉద్యోగి

అర్థం చేసుకునే వారు అదృష్టవంతులు



సభలో మాట్లాడుతున్న గునుపూడి సావిత్రి

బోట్‌క్లబ్: గృహస్థాశ్రమ ధర్మాలను, భక్తి జ్ఞాన వైరాగ్యాల వైశిష్ట్యాన్ని, సృష్టి ప్రారంభ విశేషాలను, భవిష్య పురాణం తెలియజేస్తూ, ఆచారాలను పాటించేవారి కంటే, అంతర్విషయాలను అర్థం చేసుకోగలిగేవారు అదృష్టవంతులని గజల్ రచయిత్రి గునుపూడి సావిత్రి అన్నారు. స్థానిక ద్వారకానగర్‌లోని వాధూల సంలో ఆదివారం ఆస్వాదన సాహితీ సమితి వేదికపై గొట్టుముక్కల వేంకటసత్య నరసింహశాస్త్రి అధ్యక్షతన అష్టాదశ పురాణ పరిచయ సభ జరిగింది. ఏ పురాణంలో, ఏ విషయం విశదీకరించారో తెలియడం వల్ల మాత్రమే సంప్రదాయ సాహిత్యాన్ని సరైన రీతిలో అవగాహన చేసుకోగలమన్నారు. నరసింహశాస్త్రి మాట్లాడుతూ, భారత దేశానికి దూరంగా ఇతర దేశాల్లో, ఖండాల్లో ఉంటున్న భారతీయులు మన ప్రాచీన సాహిత్యంపై ఆసక్తి ప్రదర్శిస్తున్నారన్నారు. భారతీయులు సంస్కృతీ సంప్రదాయాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు కాశీభొట్ల సత్యనారాయణ, సరిపెల్ల శ్రీరామ చంద్రమూర్తి, జీవీఎస్ మూర్తి, కొరుప్రోలు గౌరినాయుడు, ఎన్వీఎస్ మూర్తి, వి.రత్నావతి పాల్గొన్నారు.

అమిత్‌షా గోబ్యాక్ అంటూ వామపక్షాల నిరసన



అమిత్‌షా పర్యటనపై నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

కాకినాడ సిటీ: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై అనుచితంగా, అవమానకరంగా మాట్లాడిన అమిత్‌షా మన రాష్ట్రంలోనే కాదు, దేశంలో ఎక్కడా పర్యటించే నైతిక హక్కులేదని వామపక్షాల నాయకులు తీవ్రంగా విమర్శించారు. అమిత్‌షా రాష్ట్ర పర్యటనకు వచ్చిన నేపథ్యంలో, అమిత్ షా గోబ్యాక్ అంటూ రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాలు చేపట్టిన నిరసనలో భాగంగా ఆదివారం కాకినాడ ఇంద్రపాలెం వంతెన వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు దువ్వా శేషుబాబ్జీ, న్యూడెమోక్రసీ నాయకులు జె.వెంకటేశ్వర్లు, లిబరేషన్ నాయకులు గొడుగు సత్యనారాయణ మాట్లాడుతూ, అంబేడ్కర్ పేరును పదేపదే తలచుకుంటేనే మనువాదులు నిలబడలేక పోతున్నారని విమర్శించారు. రాజ్యాంగం స్థానంలో మనువాదాన్ని తీసుకొచ్చే కుట్రలు ఈ దేశంలో సాగవన్నారు. అంబేడ్కర్‌పై అవమానకరంగా మాట్లాడిన అమిత్‌షాకు చంద్రబాబు, పవన్ స్వాగతం పలకడం సమంజసంగా లేదన్నారు. ప్రజాస్వామ్యవాదులంతా బీజేపీ పాలకుల రాజ్యాంగ వ్యతిరేక చర్యలను ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు గుబ్బల ఆదినారాయణ, కె.నరసింహ, లోవ, నాగేశ్వరరావు, ఎల్లారావు, సత్తిబాబు, నూకరాజు, ప్రసాద్, కనకారావు, నరసింహారావు, కె.సత్తిరాజు, పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, సీహెచ్ సతీష్, పాలిక రాజేంద్రప్రసాద్, అనపర్తి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

విమర్శించే హక్కు కాంగ్రెస్‌కు లేదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి



చిలుకూరి రామ్‌కుమార్

బోట్‌క్లబ్: అవినీతికి కేరాఫ్ అడ్రస్ అయిన కాంగ్రెస్ నాయకులకు బీజేపీని విమర్శించే హక్కు లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ అన్నారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దేశ ద్రోహులుగా మిగిలిన కాంగ్రెస్ పార్టీ వారసులు మీరు కాదా అని ప్రశ్నించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను విమర్శించే హక్కు కూడా కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. ఈ దేశానికి దేశ ద్రోహులెవరో ప్రజలు ఎప్పుడో గుర్తించారని, అందుకే ప్రజలు వారిని ఇంటికి పంపించారన్నారు. అంబేడ్కర్ వంటి మహోన్నతుడైన వ్యక్తిని అడ్డం పెట్టుకొని, వారి రాజకీయ మనుగడ కాపాడుకోవడానికి ప్రయత్నించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో అమిత్‌షా పర్యటించకూడదని కాంగ్రెస్ నాయకులు ఎలా చెబుతారన్నారు. రాష్ట్రాభివృద్ధిలో బీజేపీ కీలక పాత్ర పోషిస్తుందని, పోలవరం, రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి నిధులు విడుదల చేస్తుందన్నారు. ఈ రాష్ట్రంలో ఒక్క సీటు కూడా గెలవని కాంగ్రెస్ నాయకులకు బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదన్నారు.

సంగీత వాయిద్య పోటీలకు విశేష స్పందన



విజేతకు బహుమతి ఇస్తున్న వీసీ మురళీకృష్ణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో సంక్రాంతి వార్షిక సంగీత సభల్లో భాగంగా ఆదివారం సూర్యకళా మందిరంలో రాష్ట్ర స్థాయి కర్ణాటక గాత్ర, వాయిద్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 35 మంది పాల్గొన్నారు. జూనియర్, సీనియర్ విభాగంలో పోటీలు జరిగాయి. పోటీలకు సంగీత విద్వాంసులు డి.నగేష్ బాబు, రెహమాన్ న్యాయమూర్తులుగా వ్యవహరించారు. గాత్రం, వయోలిన్, వేణువు, వీణ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్టీయూకే ఇన్‌చార్జి ఉపకులపతి మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్ననాటి నుంచి విద్యార్థులకు నచ్చిన అంశాల్లో తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. సంగీత రంగంలో రాణించడం ద్వారా ఎందరో పేరు ప్రఖ్యాతులు సాధించారన్నారు. గెలుపోటములతో ప్రమేయం లేకుండా విద్యార్థులు తమ కృషిని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సంగీత విద్వత్సభ అధ్యక్షుడు నారాయణం మురళీ, సెక్రటరీ వక్కలంక రామకృష్ణ, గౌరవాధ్యక్షుడు ఆర్‌పి రావు, కృష్ణంరాజు, మణిబాబు, చావలి సూర్యకుమారి, గట్టి శ్రీకృష్ణదేవరాయ, వెంకట్రావు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

గాత్ర విభాగంలో వి.సంతోష్‌కుమార్, స్మరణ్, కె.భార్గవ్ వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వాయిద్య విభాగంలో సంతోష్ తమన్, దీక్షిత్ మురారి, సాయి శర్వాణి, వీణ సీనియర్ విభాగంలో ఆర్ దేవీశ్రీప్రియ, రాజ్‌కౌశల్ బహుమతులు పొందారు.

నేటి నుంచి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

కరప: కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని కరప, కాకినాడ రూరల్ మండలాల్లో ఉన్న అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి ఈ నెలాఖరు వరకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆ శాఖ కరప సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎస్‌జీఎస్ సురేష్‌బాబు తెలిపారు. కరపలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలానికి రెండు టీములు ఏర్పాటు చేశామన్నారు. కరప మండలంలో పశు వైద్యులు డాక్టర్ ఎం.రవికిరణ్‌బాబు, డాక్టర్ అనిల్‌విల్సన్, కాకినాడ రూరల్ మండలంలో డాక్టర్ ఎం.రాజ్యలక్ష్మి, డాక్టర్ టీవీ సురేష్ వెటర్నరీ అసిస్టెంట్లతో కలిసి శిబిరాలు నిర్వహిస్తారన్నారు. ఈ పశు వైద్య శిబిరాలలో లేగదూడలకు ఏలిక పాముల నివారణ, పాడి పశువులకు జలగ వ్యాధి నివారణ, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ వంటి వ్యాధి నిరోధక టీకాలు వేస్తారని వివరించారు. పశు **వైద్య చికిత్సలు, గొడ్డుమోతు పశువులకు గర్భకోశ** వ్యాధుల చికిత్సలు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రైతులకు పశువుల యాజమా**న్యం, కేవలం పెయ్య దూడలు పుట్టే వీర్యం వంటి అం**శాలపై అవగాహన కల్పిస్తారని డాక్టర్ సురేష్‌బాబు తెలిపారు. రైతులు ఈ పశు వైద్య శిబిరాలను సద్విని**యోగం చేసుకోవాలన్నారు.**

శిబిరాలు జరిగే గ్రామాలు ఇవే..

తేదీ	కరప మండలం	కాకినాడ రూరల్ మండలం
జనవరి 20	గొర్రిపూడి	తిమ్మాపురం
జనవరి 21	గురజనాపల్లి, ఉప్పలంక, కూరాడ	గంగనాపల్లి
జనవరి 22	పెనుగుదురు, వాకాడ	చీడిగ
జనవరి 23	వేములవాడ, పెదకొత్తూరు	పండూరు, కొవ్వాడ
జనవరి 24	వలసపాకల, సిరిపురం	నేమాం, రేపూరు
జనవరి 25	యండమూరు, జి.భావారం	సర్పవరం, కొవ్వూరు
జనవరి 27	నడకుదురు, వేళంగి	వాకలపూడి, తూరంగి
జనవరి 28	కరప, పాతర్లగడ్డ, పెద్దాపురప్పాడు	తమ్మవరం, పి.వెంకటాపురం
జనవరి 29	విజయరాయుడుపాలెం, కొంగోడు	రమణయ్యపేట, పెనుమర్తి
జనవరి 30	కొరిపల్లి, జెడ్.భావారం	వలసపాలకల, సూర్యారావుపేట
జనవరి 31	అరట్లకట్ట, గొడ్డటిపాలెం	ఇంద్రపాలెం

ఓ మనిషీ.. మట్టిని రక్షించు..

మారథాన్‌లో ఆకట్టుకున్న వృద్ధుడు



సూర్యారావుపేట బీచ్ వద్ద సేవ్ సాయిల్ నినాదంతో సుబ్రహ్మణ్యశర్మ

కాకినాడ రూరల్: కాకినాడ మారథాన్‌లో విశాఖపట్నం ఎంవీపీ కాలనీకి చెందిన వృద్ధుడు, చార్టర్డ్ సివిల్ ఇంజినీర్ చల్లా సుబ్రహ్మణ్యశర్మ 'మట్టిని రక్షించు'(సేవ్ సాయిల్) అంటూ హాఫ్ మారథాన్ రన్‌తో ఆకట్టుకున్నారు. సూర్యారావుపేట బీచ్‌లో ఆదివారం ఉదయం జరిగిన మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, మన భూమాత(మట్టి) సంక్షేమానికి మూలం పాదాల కిందే ఉందన్నారు. ఈషా ఫౌండేషన్ సద్గురు మట్టిని రక్షించు ఉద్యమం 2022 మార్చిలో ప్రారంభించడంతో, ఆయన ప్రేరణతో ప్రజల్లో అవగాహన కోసం సేవ్ సాయిల్ నినాదంతో అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్టు వివరించారు. విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, హైదరాబాద్, బెంగళూరు, గోవా, రాయపూర్, సంబల్‌పూర్, భువనేశ్వర్ వంటి ప్రాంతాలలో సుమారు 5,612 కిలోమీటర్లను పరుగెత్తినట్టు చెప్పారు. చార్టర్డ్ ఇంజినీరుగా పనిచేస్తూ, వారంలో రెండు రోజుల పాటు సేవ్ సాయిల్ పేరుతో రన్ చేస్తున్నట్టు తెలిపారు.

గుమ్మడి కాదు.. పుత్తడి..!

- కూర గుమ్మడికి గణనీయంగా రాబడి
- అన్ని వేళలా ఆదాయమిచ్చే వీటిని పండించేందుకు రైతుల ఆసక్తి
- కాకినాడ జిల్లాలో విస్తారంగా పెరిగిన సాగు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న గుమ్మడికాయిలు

పిఠాపురం: భారత సంస్కృతి సంప్రదాయాల్లో గుమ్మడిది ప్రత్యేక స్థానం. శుభకార్యాలు, పూజలు, వంటలు, మిఠాయిలలోనే కాక, ఔషధాల తయారీలోను ఇది ప్రత్యేకత సంతరించుకుంది. ఇప్పటి వరకు కూరలకు, స్వీట్లకు మాత్రమే వినియోగించే గుమ్మడి ఆరోగ్యప్రదాయని అన్న విషయాన్ని కరోనా వచ్చి గుర్తు చేయడంతో.. దీనికి మళ్లీ పూర్వ వైభవం వచ్చింది. తద్వారా గుమ్మడి పంట బంగారంగా మారిపోయింది. ఈ పంటను ఇప్పుడు రైతులు తమ పొలాల్లో పండించి, మంచి రాబడి పొందుతున్నారు. ఇతర పంటలతో పోలిస్తే గుమ్మడి సాగులో శ్రమ, ఖర్చు తక్కువే. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో మేలైన రాబడినిస్తుండడంతో దీని సాగుపై రైతుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పటి వరకు కేవలం శుభకార్యాలకు, వంటల్లో ఉపయోగించే దీనిని.. ప్రస్తుతం గుండె సంబంధ వ్యాధులకు ఔషధంగా ఎక్కువగా వినియోగిస్తుండడంతో, **దీనికి గిరాకీ పెరిగి మార్కెటింగ్ ఊపందుకుంది. ఎక్కువ మంది రైతులు దీనిని పిఠాపురం నియోజకవర్గంతో పాటు, వివిధ ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో అంతర పంటగా సాగు చేసి, అధిక దిగుబడులు, రాబడిని సాధిస్తున్నారు. నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో ఇది సుమారు** 20 హెక్టార్లలో సాగవుతోంది.

రాబడిలో ముద్దు గుమ్మడి

ఏ పంటైనా కొంత సమయం మాత్రమే నిల్వ ఉంటుంది. అందుకే ధర వచ్చినా, రాకపోయినా అమ్మితీరాల్సిందే. కానీ కూర గుమ్మడి అలా కాదు. ఎన్నాళ్లయినా నిల్వ ఉంటుంది. అందుకే ఎప్పుడు ధర ఉంటే అప్పుడే అమ్ముకుంటారు. తద్వారా అనుకున్నంత ఆదాయం వచ్చి తీరుతుంది. ఎకరానికి సుమారు 12 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పెట్టుబడి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టి సాగు చేస్తే, ఎకరానికి 15 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ఒక్కో కాయ 2 కేజీల నుంచి 10 కేజీల వరకు బరువు ఉండగా, మార్కెట్‌లో టన్ను రూ.18 వేల వరకు ధర పలుకుతోంది.

నీటి వసతి తక్కువగా ఉన్నా..

కేవలం మూడు నెలల వ్యవధిలో నీటి వసతి తక్కువగా ఉన్నా, పంట ఏమాత్రం ఇబ్బంది లేకుండా పండుతోందంటున్నారు రైతులు. ఇతర పంట**లకు ఎకరానికి సరిపడా నీరు గుమ్మడికి నాలుగు ఎకరాలకు సరిపోతుంది. చీడపీడల బెడద ఉండకపోవడం, ఎరువులు, పురుగు మందుల అవసరం అతి తక్కువగా ఉండడం వల్ల పెట్టుబడి చాలా తక్కువగా ఉంటుంది. విత్తనం, ఎరువులు, కూలి ఖర్చులతో సహా ఎకరానికి రూ.15 వేల వరకు** మాత్రమే పెట్టుబడి అవుతుండగా, ఎకరానికి 15 టన్నుల వరకు దిగుబడి వచ్చి రూ.1.50 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. దీంతో రైతులు **ప్రస్తుతం ఈ పంట సాగుపై మక్కువ చూపుతున్నారు. కాకినాడ జిల్లాలో పండిస్తున్న కూర గుమ్మడి పంటను స్థానిక మార్కెట్లలో విక్రయిస్తున్నారు.** వ్యయ ప్రయాసలు తక్కువతో పాటు, అమ్ముకోవడం సులువుగా ఉండడంతో పలువురు రైతులు వీటి సాగుకు ముందుకు వస్తున్నారు.

ఆదాయం బాగుంటుందని..



నా పేరు కొండపల్లి వీరబాబు. మాది పిఠాపురం మండలం విరవాడ. నేను ఉద్యాన పంటలు సాగు చేస్తూ, సొంతంగా అమ్ముతుంటాను. బూడిద గుమ్మడితో పాటు, కూర గుమ్మడి సాగు ప్రారంభించాను. రెండేళ్లుగా నేను రెండు ఎకరాల్లో సాగు చేస్తున్నాను. పెట్టిన పంటకు మంచి దిగుబడి వచ్చింది. ఎకరానికి కనీసం రూ.50 వేల వరకు ఆదాయం వచ్చేది. దీంతో ఇతర పంటలకు పెట్టుబడి వచ్చేది. గతంలో ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తెచ్చి ఇక్కడ అమ్మేవాడిని. ఇప్పుడు సొంతంగా పండించి అమ్ముతున్నాను. ఇప్పుడు టన్ను రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పలుకుతుంది. దీంతో నేను పండించే పంటను ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రత్యేకంగా పెద్దగా పెట్టుబడి అవసరం లేకపోవడం వల్ల అంతర పంటగానే సాగు చేస్తున్నాను. పెట్టుబడి కంటే రాబడి పదిరెట్లు ఎక్కువగా ఉంటోంది. ఎక్కువగా నాటు రకాలకే డిమాండ్ ఉంటోంది. అందుకే దానినే సాగు చేస్తున్నాను.

బూడిద గుమ్మడితో ఆరోగ్య పరిపుష్టి

ఏ ఇంటి ముందు చూసినా బూడిద గుమ్మడి కాయ **తగిలించి క**నిపిస్తుంది. ఏ శుభకార్యం జరిగినా దీనిని దిష్టి తీసి కొడుతుంటారు. ఎందుకంటే దీనిలో ప్రాణ శక్తి అధికంగా ఉంటుందని పూర్వీకులు గ్రహించి, దీనికి అంత ప్రాధాన్యమిచ్చారు. అదే ప్రాణ శక్తిని మనిషికి కూడా అందించే దివ్యౌషధంగా కరోనా వచ్చిన తరువాత గుర్తించారు. దీనిని ఔషధంగా ఉపయోగిస్తే కలిగే లాభాలు అంతాఇంతా కాదంటున్నారు ఆయుర్వేద వైద్యులు. ఇందులో బీటా కెరోటిన్ ఎక్కువగా ఉంటుంది. ఈ యాంటీ ఆక్సిడెంట్‌ను శరీరం విటమిన్–ఏగా మార్చుకుంటుంది. ముఖ్యంగా శరీరానికి హాని కలిగించే సూక్ష్మక్రిములను బయటకు నెట్టి వేస్తుంది. గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలతో పాటు, ఇతర అవయవాలు బలంగా ఉండేలా చూస్తుంది. ఇది తినడం ద్వారా విటమిన్–ఏ ఎక్కువగా లభిస్తుంది. కంటి సమస్యలు దూరమవుతాయి. పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. క్యాలరీలు చాలా తక్కువగా ఉండడం, పీచు ఎక్కువగా ఉండడం వల్ల జీర్ణవ్యవస్థ సక్రమంగా పని చేయడానికి దోహదపడుతుంది. వంద గ్రాముల గుమ్మడి జ్యూస్‌లో కేవలం 10 క్యాలరీలు మాత్రమే ఉండడంతో, దీనిని జీరో క్యాలరీస్ జ్యూస్‌గా చెబుతుంటారు. అన్ని కూరగాయల కంటే అతి తక్కువ క్యాలరీలు ఉన్నది ఇది ఒక్కటే. దీనిలో విటమిన్స్, మినరల్స్, లవణాలు చెప్పలేనన్ని ఉంటాయి. ప్రతి రోజు గ్లాసు జ్యూస్ తీసుకుంటే, శరీరంలో క్యాన్సర్ కణాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని, గుండె పనితీరు మెరుగుపడుతుందని శాస్త్రీయ పరిశోధనల్లో నిరూపితమైంది. మెదడు పనితీరు పెరగడం, శరీరంలో చురుకుదనం పెరగడం దీని ప్రత్యేకత.

రైతులు ఆసక్తి చూపుతున్నారు



గుమ్మడి సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో ఈ పంటను సాగు చేసేందుకు గతంలో కంటే ఇప్పుడు రైతులు ముందుకు వస్తున్నారు. పెద్దగా పెట్టుబడి పెట్టే అవసరం లేకపోవడం, అంతర పంటగా సాగు చేసుకునే వీలుండడంతో పాటు, మంచి ఆదాయం కూడా వస్తుండడంతో దీనిపై రైతుల్లో ఆసక్తి పెరిగింది. గత రెండేళ్ల కంటే ఈ ఏడాది దీనిని సాగు చేసే రైతులు పెరిగారు. ఉద్యాన శాఖ ద్వారా రైతులకు సూచనలు అందిస్తున్నాం. మార్కెటింగ్ సౌకర్యం పెరగడంతో ఆదాయం బాగుంటుంది.

– కేఎస్ శైలజ, ఉద్యాన శాఖాధికారి, పిఠాపురం